www.methukuseema news    Methuku Seema

# మెతుకు సీమ

నిత్యం - ప్రజల పక్షం    తెలుగు డిజిటల్ దిన పత్రిక

హైదరాబాద్ | సంపుటి :01 | సంచిక :01 | శనివారం | 28 సెప్టెంబర్ 2024

Published from : Hyderabad,Sanagareddy,Warangal,Nalgonda,Nizamabad,Kammam    పేజీలు :05  వేల :05




## నేడు హైదరాబాద్‌కు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము



- నల్సార్ యూనివర్సిటీ స్నాతకోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ముర్ము
- హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు
- ఉదయం తొమ్మిది గంటల నుంచి పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ మళ్లింపు
- బేగంపేట నుంచి బొల్లారం వరకు ట్రాఫిక్ మళ్లింపు ఉంటుందన్న అడిషనల్ సీపీ

2

## ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త



2

- విద్యార్థులకు ఉచిత పర్యాటక, చారిత్రక ప్రదేశాలను సందర్శించే అవకాశం కల్పిస్తామని వెల్లడి
- కట్టడాల పరిరక్షణకు పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని విజ్ఞప్తి
- చార్మినార్ పరిరక్షణ ప్రాజెక్టు కొనసాగుతుందని వెల్లడి

## హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు హైకోర్టు నోటీసులు

- అమీన్‌పూర్ చెరువులో భవనం కూల్చివేతపై హైకోర్టుకు బాధితుడు
- కేసును విచారించిన హైకోర్టు
- వివరణ ఇచ్చేందుకు విచారణకు హాజరు కావాలని హైడ్రా కమిషనర్ కు ఆదేశాలు



హైదరాబాద్ , డెస్క్ ,సెప్టెంబర్ 28 ( మెతుకు సీమ న్యూస్) : అమీన్‌పూర్ చెరువుకు సంబంధించిన కేసు విషయంలో విచారణ చేపట్టిన హైకోర్టు.. హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు నోటీసులు జారీ చేసింది. హైడ్రా కమిషనర్ సోమవారం విచారణకు హాజరుకావాలని ఆదేశించింది. అమీన్‌పూర్ చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉందని ఇటీవల ఓ భవనాన్ని హైడ్రా సిబ్బంది కూల్చివేశారు. కోర్టులో కేసు పెండింగ్‌లో ఉందని చెప్పినా పట్టించుకోకుండా కూల్చేశారని బాధితుడు హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. దీనిపై హైడ్రా కమిషనర్ వివరణ ఇవ్వాలని సూచించిన హైకోర్టు.. నేరుగా లేదా ఆన్‌లైన్ విచారణకు హాజరు కావాలని ఆదేశించింది.

## హైదరాబాద్‌లో పోస్టర్లు, బ్యానర్లు, కటౌట్లపై జీహెచ్ఎంసీ నిషేధం




- ఎలాంటి బ్యానర్లు అంటించవద్దని ఉత్తర్వులు జారీ చేశామన్న ఆమ్రపాలి
- కటౌట్లు, వాల్ పోస్టర్లు, వాల్ పెయింట్లపై సీరియస్‌గా వ్యవహరించాలని ఆదేశం
- సినిమాలకు సంబంధించిన పోస్టర్లు కూడా అతికించవద్దని స్పష్టీకరణ

## ఘనంగా కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు

- తెలంగాణ ఉద్యమ నేల కొండ లక్ష్మణ్ బాపూజీ 109వ జయంతి పురస్కరించుకొని...
- బాపూజీ విగ్రహానికి పూలమాలలు సమర్పించిన జిల్లా కలెక్టర్ ముల్లూరు క్రాంతి,టి జి ఐ ఐ సి చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి



సంగారెడ్డి బ్యూరో,సెప్టెంబర్ 28 ( మెతుకు సీమ న్యూస్) : తెలంగాణ అస్తిత్వాన్ని చాటేందుకు బాపూజీ నడిపిన రాజీలేని పోరాటాలు, తెలంగాణ సోయి కలిగిన స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణా ఉద్యమనేత కొండా లక్ష్మణ్ బాపూజీ 109 వ జయంతి ని పురస్కరించుకొని శుక్రవారం సంగారెడ్డి పట్టణం లోని ఎఫ్ ఆర్ ఎస్ పక్కన ఏర్పాటు చేసిన కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు, టి జి ఐ ఐ సి చైర్మన్ నిర్మల

2

## ఎవరూ భయపడవద్దు... మీ వెంట కేసీఆర్ ఉన్నారు

- ప్రజల ఆమోదం తీసుకున్నాకే ప్రక్షాళన చేపట్టాలని సూచన
- బలవంతం చేస్తే హైదరాబాద్ మరో అగ్నిగోళం అవుతుందని హెచ్చరిక
- గంగానది ప్రక్షాళన కోసం రూ.40 వేల కోట్లు అయితే మూసీకి రూ.1.50 లక్షల కోట్లా? అని నిలదీత

2



## హైడ్రా విషయంలో కోర్టుకు వెళతాం... చూస్తూ ఊరుకునేది లేదు

- హైడ్రా పేరుతో ప్రజలపై దౌర్జన్యం చేస్తే ఊరుకునేది లేదన్న ఈటల
- బాధితులకు న్యాయం జరిగేలా సీఎం చర్యలు తీసుకోవాలన్న ఎంపీ
- పేదలపై కనికరం లేకుండా రేవంత్ రెడ్డి ప్రభుత్వం చర్యలు ఉన్నాయని విమర్శ



హైదరాబాద్ , డెస్క్ ,సెప్టెంబర్ 28 ( మెతుకు సీమ న్యూస్) : హైడ్రా విషయంలో అవసరమైతే హైకోర్టుకు వెళతామని, తాము చూస్తూ ఊరుకునేది లేదని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. హైడ్రా పేరుతో ప్రజలపై దౌర్జన్యం చేస్తే బీజేపీ సామాన్యుల పక్షాన నిలుస్తుందన్నారు. అవసరమైతే లక్షమందితో రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని

2

## కర్ణాటక సీఎం సిద్ధరామయ్యపై కేసు నమోదు

- ముడా కేసులో సిద్ధరామయ్యపై ఆరోపణలు
- లోకాయుక్త ఆధ్వర్యంలో దర్యాప్తునకు ప్రత్యేక న్యాయస్థానం అనుమతి
- సీఎంతో పాటు పలువురిపై లోకాయుక్తలో కేసు నమోదు

2



# నేడు హైదరాబాద్‌కు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము... నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు

హైదరాబాద్ , డెస్క్ ,సెప్టెంబర్ 28 ( మెతుకు సీమ న్యూస్) : భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రేపు (సెప్టెంబరు 28) హైదరాబాద్ రానున్నారు. నల్సార్ యూనివర్సిటీ 21వ స్నాతకోత్సవ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. రాష్ట్రపతి రాక నేపథ్యంలో రేపు నగరంలోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు అమలు చేస్తున్నారు. ఈ మేరకు అదనపు సీపీ (ట్రాఫిక్) విశ్వప్రసాద్ వెల్లడించారు. శనివారం ఉదయం 9 గంటల నుంచి బేగంపేట, హెచ్‌పీఎస్, పీఎన్‌టీ జంక్షన్, రసూల్‌పురా, సీటీవో ప్లాజా, టివోలీ, కారా?నా, తిరుమలగిరి, లోతుకుంట, బొల్లారం రాష్ట్రపతి నిలయం ప్రాంతాల్లో ట్రాఫిక్ మళ్లింపు ఉంటుందని తెలిపారు. నిన్న బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో పోలీస్, రెవెన్యూ, ఆర్ అండ్ బీ, వైద్య ఆరోగ్యశాఖ, అగ్నిమాపక, అటవీ, విద్యుత్, తదితర శాఖల ఏర్పాట్లపై కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సమీక్ష నిర్వహించారు. రోడ్లపై ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నం కాకుండా భద్రతా ఏర్పాట్లు, బందోబస్తును పర్యవేక్షించాలన్నారు. అనంతరం రాష్ట్రపతి నిలయంలో ఏర్పాటు చేసిన 8 రాష్ట్రాలకు సంబంధించిన స్టాళ్లను, 4 ఫుడ్ కోర్టులను, మీడియా సెంటర్‌ను, ఇతర స్టాల్స్‌ను పరిశీలించారు.

# హైడ్రా విషయంలో కోర్టుకు వెళతాం... చూస్తూ ఉరుకునేది లేదు

మొదటిపేజీ తరువాయి : ప్రశ్నిస్తామన్నారు. కూల్చివేతల విషయంలో బాధితులకు న్యాయం జరిగేలా ముఖ్యమంత్రి చర్యలు తీసుకోవాలని కోరారు. పేదల కన్నీటితో ఆడుకుంటే పతనం తప్పదని హెచ్చరించారు.చైతన్యపురి డివిజన్ న్యూమారుతీ నగర్ మూసీ పరివాహక ప్రాంతంలో ఈటల పర్యటించి, బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... హైడ్రా పేరుతో రేవంత్ రెడ్డి ప్రభుత్వం డ్రామాలు ఆడుతోందన్నారు. హైడ్రాను నియమించిన రోజే ఇది డ్రామా అని చెప్పానని గుర్తు చేశారు. అధికారుల లెక్కల ప్రకారం చెరువులు, కుంటలు చుట్టూ ఉన్నది ప్రభుత్వ భూమి కాదన్నారు. ఏళ్లుగా ఉన్న పేదల ఇళ్లను కూల్చవద్దని కోరారు.పేదలపై కనికరం లేకుండా రేవంత్ రెడ్డి ప్రభుత్వ చర్యలు ఉన్నాయన్నారు. జొన్నలబండ వద్ద ఇందిరాగాంధీ పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చారని... వాటిని కూల్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధమైందని మండిపడ్డారు. మూసీని సుందరీకరణ చేస్తే తమకు ఇబ్బంది లేదని, కానీ ఎన్నడో భూమి కొన్నవారు ఇప్పటికీ ఈఎంఐలు కడుతున్నారని, అలాంటి వారికి నష్టం జరగవద్దన్నారు. లక్షలు పెట్టి కొన్న ఇళ్లకు ప్రత్యామ్నాయంగా డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇస్తామనడం కరెక్ట్ కాదన్నారు. ఈ ప్రాంతాల్లో ఏనాడూ మూసీ నుంచి వరద నీరు రాలేదన్నారు. ప్రజలు ఓట్లు వేస్తేనే గెలిచిన విషయం మరువవద్దన్నారు. హైడ్రా పేరుతో రేవంత్ రెడ్డి ప్రభుత్వం బస్తీ ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ మాటలు నమ్మినందుకు ప్రజలకు ప్రశాంతత లేకుండా చేస్తున్నారన్నారు. ఖబడ్దార్ రేవంత్ రెడ్డి... ప్రజలని ఇబ్బంది పెట్టడం మానుకోవాలని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వానికి ఈ అంశంపై నివేదిక ఇస్తామన్నారు. చట్టాలు, జడ్జీల మీద నమ్మకం లేకుండా రేవంత్ రెడ్డి పని చేస్తున్నారని వ్యాఖ్యానించారు.

# కర్ణాటక సీఎం సిద్ధరామయ్యపై కేసు నమోదు

హైదరాబాద్,డెస్క్ ,సెప్టెంబర్ 28 ( మెతుకు సీమ న్యూస్) : కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యపై నేడు కేసు నమోదయింది. ఆయనపై లోకాయుక్త ఈ కేసును నమోదు చేసింది. ముడా (మైసూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ) భూముల వ్యవహారంలో ఆయన ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఈ క్రమంలో, లోకాయుక్త ఆధ్వర్యంలో దర్యాప్తునకు ప్రత్యేక న్యాయస్థానం అనుమతించింది.ఈ నేపథ్యంలో ఎఫ్ఐఆర్‌లో సిద్ధరామయ్యను ఏ1గా పేర్కొన్నారు. నిందితుల జాబితాలో సిద్ధూతో పాటు ఆయన భార్య పార్వతి, బావమరిది మల్లికార్జున్ తదితరులను కూడా చేర్చారు. ముడా స్థలాల కేటాయింపులో సిద్ధరామయ్య, ఆయన కుటుంబ సభ్యులు లబ్ధి పొందారని, ఇందుకోసం ఆయన తన అధికారాన్ని దుర్వినియోగం చేశారని సామాజిక కార్యకర్త ఇబ్రహీం గవర్నర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఈ స్కాం దర్యాప్తులో భాగంగా సిద్ధరామయ్యను విచారించేందుకు గవర్నర్ అనుమతి ఇచ్చారు. గవర్నర్ అనుమతి ఇవ్వడంపై సిద్ధరామయ్య హైకోర్టుకు వెళ్లారు. హైకోర్టులో కూడా ఆయనకు చుక్కెదురైంది.

# రుణమాఫీ విషయంలో ప్రభుత్వానికి హరీష్ రావు డెడ్ లైన్



హైదరాబాద్,డెస్క్,సెప్టెంబర్ 28 ( మెతుకు సీమ న్యూస్) : రుణమాఫీ విషయంలో తెలంగాణ ప్రభుత్వానికి మాజీ మంత్రి హరీష్ రావు డెడ్ లైన్ విధించారు. దసరాలోపు రైతులందరికీ రుణమాఫీ చేయాలని అల్టిమేటం ఇచ్చారు. లేదంటే రైతులందరితో కలిసి సచివాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు. సిద్దిపేట జిల్లాలోని నంగునూరు మండల కేంద్రంలో రైతులు నిర్వహించిన ధర్నాలో ఆయన శుక్రవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాలేవో నీళ్ళేవో తేలాలంటే కొద్దిగా టైం పడుతుందన్నారు. కేసీఆర్ పాలనలో రైతులు ఏ విధంగా ఉండేవారో, కాంగ్రెస్ పాలనలో రైతుల పరిస్థితి ఎలా ఉందనేది అందరికీ అర్థమవుతుందన్నారు. కేసిఆర్ ముఖ్యమంత్రి కాకముందు రైతులకు ఎరువు బస్తా కావాలంటే ఉదయం ఐదు గంటలకు చెప్పులు లైన్లో పెడితే ఒక్క ఎరువు బస్తా దొరికేదని గుర్తుచేశారు. కేసిఆర్ ప్రతీ ఊరికి ఎరువులను లారీల్లో పంపిస్తే, ఇప్పుడు కాంగ్రెస్ రైతులను ఎరువు బస్తాల కోసం లైన్ల నిలబెట్టిందని విమర్శించారు. కేసీఆర్ రాక ముందు మోటర్లు కాలిపోయేవని, ట్రాన్స్‌ఫార్మర్‌లు పేలిపోయేవన్నారు. బీఆర్ఎస్ పాలనలో ట్రాన్స్‌ఫార్మర్‌లు కాలకుండా కడుపునిండా రైతులకు కరెంటు ఇచ్చినట్లు పేర్కొన్నారు.కాంగ్రెస్ పాలనలో దొంగ రాత్రి కరెంట్ వచ్చేదని, కానీ కేసీఆర్ 24 గంటలు కరెంట్ అందించాడన్నారు. మళ్ళీ కాంగ్రెస్ పాత రోజులు తీసుకొని వచ్చిందని, కాలిపోయే మోటర్లు, పేలిపోయే ట్రాన్స్‌ఫార్మర్‌ల పరిస్థితిని తీసుకొచ్చిందని మండిపడ్డారు. నారాయణపేట కాంగ్రెస్ ఎమ్మెల్యే పర్ణికా రెడ్డి ఓ సమావేశంలో కేసీఆర్ ఉన్నప్పుడు 24 గంటలు కరెంట్ ఎలా వచ్చిందని ఇప్పుడు ఎందుకు రావడం లేదని అధికారులను ప్రశ్నిస్తుందన్నారు. కరోనా వచ్చినప్పుడు కూడా రైతులకు రైతుబంధు వేసిన ముఖ్యమంత్రి కేసీఆర్ అని కొనియాడారు. కరోనాలో ఆదాయం లేకపోయినా ఎమ్మెల్యేల, మంత్రుల జీతాలు బంద్ పెట్టినా, కానీ రైతులకు మాత్రం రైతుబంధు ఇచ్చినట్లు చెప్పారు. అది కేసీఆర్‌కు రైతు మీదున్న ప్రేమ అని, మరి కాంగ్రెస్ ప్రభుత్వానికి ఏమైంది? అని ప్రశ్నించారు. కరోనా లేదు అయినా కూడా కాంగ్రెస్ ప్రభుత్వం రైతుబంధు ఇవ్వడం లేదని దుయ్యబట్టారు. పంట కోతకు ఉన్నా, దసరా పండుగ దగ్గరకు వస్తున్నా ఇంకా కాంగ్రెస్ ప్రభుత్వం రైతుబంధు వేయలేదన్నారు.సీఎం రేవంత్ రెడ్డి మాటలు మాత్రం కోటలు దాటుతాయని, కానీ రైతులకు మాత్రం రైతుబంధు వేయట్లేదన్నారు. కేసీఆర్ వచ్చిన తర్వాత తెలంగాణలో రైతుల భూముల విలువలు పెరిగినట్లు చెప్పారు. ముందు ఎకరం రూ.5 లక్షలు కూడా ఉండేది కాదన్నారు. బీఆర్ఎస్ పాలనలో రైతు విలువతో పాటు రైతు భూమి విలువ కూడా పెరిగిందన్నారు. కాంగ్రెస్ వచ్చింది రైతు విలువ తగ్గించిందని మండిపడ్డారు. బీఆర్ఎస్ పాలనలో చేపట్టిన మిషన్ కాకతీయతో చెరువులు నిండుకుండల్లా ఉన్నాయన్నారు. కాళేశ్వరం కూలిపోయిందని అంటున్న సీఎం రేవంత్ రెడ్డి రంగనాయక సాగర్, మల్లన్న సాగర్ ప్రాజెక్టలను చూడాలన్నారు. రేవంత్ రెడ్డికి కూలగొట్టుడు తప్ప కట్టడం తెలియదని విమర్శించారు. సీఎం కాళేశ్వరం మొత్తం కూలిపోయిందని అబద్ధపు ప్రచారం చేస్తున్నాడని పేర్కొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త

హైదరాబాద్ , డెస్క్ ,సెప్టెంబర్ 28 ( మెతుకు సీమ న్యూస్) : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. విద్యార్థులకు ఉచితంగా పర్యాటక, చారిత్రక ప్రదేశాలను సందర్శించే అవకాశం కల్పిస్తున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఈరోజు 'తెలంగాణ దర్శిని' కార్యక్రమానికి సంబంధించిన జీవోను జారీ చేసినట్లు వెల్లడించారు. చారిత్రక, పర్యాటక ప్రాంతాలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు తెలంగాణ దర్శినిని రూపొందించారు. తెలంగాణ దర్శిని పోస్టర్‌ను ఆవిష్కరించిన ముఖ్యమంత్రి మాట్లాడుతూ... మన సంస్కృతికి చిహ్నంగా ఉన్న కట్టడాల పరిరక్షణకు పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని కోరారు. రాష్ట్రంలో సంక్షేమంతో పాటు పర్యావరణ రంగాన్ని కూడా ముందుకు తీసుకువెళతామన్నారు. గత ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల నగరంలోని ఎన్నో చారిత్రాత్మక కట్టడాలు శిథిలావస్థకు చేరుకున్నాయన్నారు. పాత అసెంబ్లీ భవనాన్ని పునరుద్ధరిస్తున్నట్లు చెప్పారు. అందులో శాసన మండలిని ఏర్పాటు చేస్తామని తెలిపారు. జూబ్లీహాలును కూడా పరిరక్షించాల్సి ఉందన్నారు. ఉస్మానియా ఆసుపత్రిని గోషామహల్‌కు తరలించి ప్రస్తుత భవనాన్ని పరిరక్షించడానికి అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. చార్మినార్ పరిరక్షణ ప్రాజెక్టు కొనసాగుతోందని, అలాగే హైకోర్టు భవనం, సిటీ కాలేజీ భవనం, పురానాపూల్ బ్రిడ్జి వంటి చారిత్రక కట్టడాలను కాపాడుకోవాలన్నారు.

# ఘనంగా కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు



మొదటిపేజీ తరువాయి : జగ్గారెడ్డి, అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్ , మాధురి, పట్టణ పురపాలక సంఘం చైర్మన్ విజయలక్ష్మి లు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. తెలంగాణవాది, స్వాతంత్ర్య పోరాట యోధుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 109 జయంతి వేడుకను వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు మాట్లాడుతూ నిరంకుశ నిజాం కు వ్యతిరేకంగా ఉద్యమం నాయకులలో ప్రముఖుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ అని కలెక్టర్ అన్నారు. రాష్ట్ర చేనేత సహకార రంగానికి విశేష కృషి చేసిన కృషివలుడు, పౌర హక్కుల పై తీవ్ర నిర్బంధం కొనసాగుతున్న రోజులలో తానే సిటిజన్ ప్రొటెక్షన్ కమిటీని ఏర్పాటు చేసి ప్రజా చైతన్య కార్యక్రమాలు రూపొందించారని తెలిపారు. 1969 లో తెలంగాణ రాష్ట్రం కోసం తొలి దశ తెలంగాణ ఉద్యమానికి అండగా నిలిచారని అన్నారు సామాజిక న్యాయం, క్రమశిక్షణ , దీక్ష, దృఢసంకల్పం కలిగిన వ్యక్తి ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ అని అందరికి ఆదర్శనీయులన్నారు.తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమానికి అండగా దీక్షను చేయడమే కాకుండా తన మంత్రి పదవిని తృణప్రాయంగా వదిలేసి ఉద్యమానికి అండగా నిలిచిన మహనీయులు కొండా లక్ష్మణ్ బాపూజీ అని గుర్తు చేసుకున్నారు.వారి ఆశయ సాధనలో అధికారులు ప్రజాసేవలో ప్రజా సమస్యలు త్వరతగతిన పరిష్కరించాలని అధికారులను కోరారు. అనంతరం ఓల్డ్ జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన జయంతి కార్యక్రమాన్ని జిల్లా పరిషత్ సీఈఓ జానకి రెడ్డి,వెనుకబడిన తరగతుల జిల్లా అధికారి జగదీష్ జ్యోతి ప్రజ్వలన చేసి , కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీ గారు తెలంగాణ రాష్ట్రా సాధన కొరకు చేసిన కృషిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం నాయకులు జి పందరి, హరిహర కిషన్, జి సత్యనారాయణ,ఎం మల్లేశం, టి అశోక్, వివిధ సంఘాల నాయకులు, వసతి గృహ సంక్షేమ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో పోస్టర్లు, బ్యానర్లు, కటౌట్లపై జీహెచ్‌ఎంసీ నిషేధం

హైదరాబాద్,డెస్క్ ,సెప్టెంబర్ 28 ( మెతుకు సీమ న్యూస్) : గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఇక నుంచి ఎలాంటి పోస్టర్లు అతికించవద్దని గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పోరేషన్ కమిషనర్ ఆమ్రపాలి వెల్లడించారు. ఎలాంటి బ్యానర్లు కట్టవద్దని, పోస్టర్లు అంటించవద్దని ఉత్తర్వులు జారీ చేశామన్నారు. ఆమె మాట్లాడుతూ... కటౌట్లు, వాల్ పోస్టర్లు, వాల్ పెయింట్లపై సీరియస్‌గా వ్యవహరించాలని సర్క్యులర్ జారీ చేశామన్నారు. సినిమాలకు సంబంధించిన పోస్టర్లు కూడా అతికించవద్దని స్పష్టం చేశారు. ఈ మేరకు డిప్యూటీ కమిషనర్లకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా పోస్టర్లు అతికిస్తే మాత్రం జరిమానా విధిస్తామని హెచ్చరించారు. హైదరాబాద్ నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.


# ఎవరూ భయపడవద్దు... మీ వెంట కేసీఆర్ ఉన్నారు



హైదరాబాద్,డెస్క్ ,సెప్టెంబర్ 28 ( మెతుకు సీమ న్యూస్) : మూసీ పరీవాహక ప్రాంతంలో ఉంటున్న వారు ఎవరూ భయపడవద్దని, మీ వెంట కేసీఆర్ ఉన్నాడని, బాధితుల పక్షాన బీఆర్ఎస్ పోరాడుతుందని ఆ పార్టీ నేత పటోళ్ల కార్తీక్ రెడ్డి అన్నారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ... మూసీ పరీవాహక ప్రాంతంలో ప్రజల ఆమోదం తీసుకున్న తర్వాతే ప్రక్షాళన చేపట్టాలని సూచించారు. బలవంతం చేస్తే మాత్రం హైదరాబాద్ మరో అగ్నిగోళం అవుతుందని హెచ్చరించారు. మూసీ నదిపై ఆదిత్య సంస్థ నిర్మాణాలు చేపడుతుంటే వాటిని ఆపకుండా, పేదల ఇళ్లను కూల్చేందుకు మార్క్ చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఆదిత్య సంస్థ ప్రభుత్వ పెద్దల చేతులు తడపడం వల్లే వారిని వదిలేశారని ఆరోపించారు. రెండేళ్ల క్రితం ఆదిత్య సంస్థకు తమ ప్రభుత్వం అనుమతులు ఇచ్చినప్పటికీ, ఆ తర్వాత అనుమతి నిరాకరించిందన్నారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి కాగానే ఆదిత్య సంస్థ నిర్మాణలకు అనుమతులు ఇచ్చారని మండిపడ్డారు. దేశంలోనే అత్యంత పొడవు కలిగిన గంగా నది ప్రక్షాళన కోసం రూ.40 వేల కోట్లు అయితే, గండిపేట నుంచి నాగోల్ వరకు 55 కిలోమీటర్ల విస్తీర్ణం కలిగి ఉన్న మూసీ నది సుందరీకరణకు లక్షా యాభై వేల కోట్ల రూపాయలు ఎందుకో చెప్పాలని నిలదీశారు. మూసీ నది డీపీఆర్ కోసం రూ.1,500 కోట్లు ఖర్చు చేయడం ఏమిటని, ప్రపంచంలో ఇలాంటిది చూశామా? అని మండిపడ్డారు. మూసీ సుందరీకరణ అనేది భారీ కుంభకోణమని ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో ఈ ప్రాజెక్టు వ్యయం రూ.16,000 కోట్లు అయితే ఇప్పుడు రూ.1,50,000 కోట్లకు పెరిగిందని విమర్శించారు.

# అలుపెరుగనిపోరాట యోధుడికి ఘన నివాళి

**-శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీకి నివాళి అర్పించిన యువనాయకుడు మాదిరి ప్రిథ్వీరాజ్**





పఠాన్ చేరు,సెప్టెంబర్ 28 ( మెతుకు సీమ న్యూస్) : కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని పురస్కరించుకొని ఏం డి ఆర్ ఫౌండేషన్ కో–ఫౌండర్, బీఆర్ఎస్ యువ నాయకుడు మాదిరి ప్రిథ్వీరాజ్ ఆయనకు నివాళులు అర్పించారు. పటాన్ చెరు పట్టణంలోని కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పటాన్‌చెరు శాసనసభ్యులు శ్రీ గూడెం మహిపాల్ రెడ్డి గారితో కలిసి యువనాయకుడు మాదిరి ప్రిథ్వీరాజ్ గారు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.అలాగే అక్కడే నిర్వహించిన అన్నదానం లో పాల్గోన్నారు. ప్రిథ్వీరాజ్ గారు మాట్లాడుతూ స్వాతంత్ర పోరాటం మొదలు, తెలంగాణ తొలి, మలి తొలిదశ ఉద్యమాల్లో ఆయన పోషించిన పాత్ర చాలా విశిష్టమైనదన్నారు. స్వరాష్ట్ర కల సాకారం కావడంలో బాపూజీ కృషి చాలా గొప్పదన్నారు. ఆయన స్ఫూర్తితోనే భవిష్యత్తులో తాము ప్రజల పక్షాన నిలిచి వారికి మెరుగైన సేవలు అందేలా పాటు పడతామన్నారు. ఈ కార్యక్రమంలో పటాన్ చెరు నియోజకవర్గానికి చెందిన నేతలు రమేష్ , వంగరి అశోక్ , రాములు , రాజు , స్థానిక నాయకులు, యువత పాల్గొన్నారు.

# బి.వి.ఆర్.ఐ.టి. కళాశాల బస్సులు ఢీకొని డ్రైవర్ మృతి విద్యార్థులకు తీవ్ర గాయాలు





నర్సాపూర్,సెప్టెంబర్ 28 ( మెతుకు సీమ న్యూస్) : మెదక్ జిల్లా నర్సాపూర్ సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. నర్సాపూర్ సంగారెడ్డి ప్రధాన రహదారి పై బి.వి.ఆర్.టి కళాశాలకు చెందిన రెండు బస్సులు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కళాశాల బస్సు డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందగా బస్సులో ప్రయాణిస్తున్న విద్యార్థులకు తీవ్ర గాయాలయ్యాయి. జతగాత్రుల ను ఆసుపత్రికి తరలిస్తున్నారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు విచారణ చేపట్టారు పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# మృతుని కుటుంబానికి అండగా మాజీ ఎంపిటిసి కవిత



జగదేవపూర్ రూరల్,సెప్టెంబర్ 28 ( మెతుకు సీమ న్యూస్) : జగదేవ పూర్ మండల కేంద్రానికి చెందిన బండోజు నందకిషోర్ అనారోగ్యం తో మృతి చెందారు.విషయం తెలుసుకున్న స్థానిక మాజీ ఎంపీటీసీ బి ఆర్ ఎస్ పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు కవిత బాధిత కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు అనంతరం వారి కుటుంబానికి ఆర్థిక సహాయం అంద చేసి ,వారి అంత్య క్రియలకు కావాల్సిన అవసరాలను సమకూర్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాధిత కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటానని చెప్పారు.

# బతుకమ్మ చీరలు బంద్..ఆవేదన వ్యక్తం చేస్తున్న తెలంగాణ ఆడబిడ్డలు



సంగారెడ్డి ,సెప్టెంబర్ 28 ( మెతుకు సీమ న్యూస్) : తెలంగాణ రాష్ట్రంలోని ఆడబిడ్డల కోసం ప్రతి ఏడాది కోటి బతుకమ్మ చీరలు పంపిణి పథకానికి కాంగ్రెస్ ప్రభుత్వం పండుగ సమీపిస్తున్న ఇప్పుటి వరకు చీరల పంపిణి ఊసేలేదు. కనీసం కానుకలు ఇచ్చే అంశం కూడా తెరపైకి రాలేదు అని. రాయికోడ్ మండలం బీఆర్ఎస్ పార్టీ యువనాయకుడు దాడువై పవన్ కుమార్ తెలిపారు. దీంతో ఆడబిడ్డలు మనోవేదన చెందుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారలోకి వచ్చిన తెలుగు సంవత్సరంలోనే బతుకమ్మ చీరలకు మంగళం పాడడం పై సర్వత్ర విమర్శలు వెల్లువేత్తుతున్నాయి. గత సీఎం కెసిఆర్ ప్రవేశపెట్టిన బతుకమ్మ చీరల పంపిణి రాష్ట్రములో పండుగల సాగేది. ఉచిత చీరలతో బతుకమ్మ పండుగను సంబురంగా జరుపుకునేవారు. ఆర్డర్లు లేక నేతన్నల ఇక్కట్లు పడుతున్నారు. బతుకమ్మ చీరల పంపిణిని నిలిపివేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో, నేత కార్మికుల జీవితలపై తీవ్ర ప్రభావం పడింది. ఈ ఏడాది చీరల తయారీ కోసం ఆర్డర్లు లేకపోవడంతో, రాష్టంలోని నేతన్నల జీవితాలు చిద్రమవుతున్నాయి. నేత కార్మికులు మళ్ళీ ఆర్థిక సంక్షోభంలోకి కురుకుపోతున్నారు. గత సీఎం కెసిఆర్ గారి హయాంలో తీసుకున్న నిర్ణయలతో చేనేత కార్మికులు అన్ని విధాలా అభివృద్ధి చెందారు. ఆర్థికంగా నీలదొక్కుకున్నారు. 2017 నుంచి 2023 వరకు ప్రతి ఏడాదికి. కోటి మంది మహిళలకు ఉచితంగా చీరల పంపిణి చేసారు. చీరల తయారికి ఏడాదికి దాదాపు రూ. 300 కోట్లుకు పైగానే మొత్తం రూ. 2,157 కోట్లు కేటాయించింది అని బీఆర్ఎస్ పార్టీ యువనాయకుడు దాడువై పవన్ కుమార్ తెలియజేసారు.

# ఎంఈఓ రాథోడ్ కు కార్పొరేటర్ అభినందనలు



రామచంద్రాపురం,సెప్టెంబర్ 28 ( మెతుకు సీమ న్యూస్) : రామచంద్రాపురం మండలం నూతన మండల ఎడ్యుకేషనల్ ఆఫీసర్ గా బాధ్యతలు స్వీకరించిన రాథోడ్ ను శుక్రవారం స్థానిక కార్పొరేటర్ పుష్ప నగేష్ ఎంఈఓ కార్యాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. విద్యాభివృద్ధి, పాఠశాలల బాగు కోసం నూతన ఎంఈఓ కృషి చేయాలని ఈ సందర్భంగా కార్పొరేటర్ కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు

**- నివాళులర్పించిన ఫోరమ్ ఫర్ బెటర్ సంగారెడ్డి నాయకులు శ్రీధర్**




సంగారెడ్డి బ్యూరో,సెప్టెంబర్ 28 ( మెతుకు సీమ న్యూస్) : ఆచార్య కొండా లక్షణ్ బాపూజీ జయంతి సందర్భంగా నివాళులు అర్పించిన ఫోరమ్ ఫర్ బెటర్ సంగారెడ్డి నాయకులు. స్వాతంత్ర సమరయోధులు తొలి తెలంగాణ ఉద్యమ కారుడు ఆచార్య కొండా లక్షణ్ బాపూజీ జయంతి సందర్బంగా సంగారెడ్డి లో గల ఆయన విగ్రహనికి పూల మాల వేసి నివాళులు అర్పించిన ఫోరమ్ ఫర్ బెటర్ సంగారెడ్డి నాయకులు ఈ సందర్బంగా ఫోరమ్ అధ్యక్షులు శ్రీధర్ మహేంద్ర మాట్లాడుతూ,ఆచార్య కొండా లక్షణ్ బాపూజీ స్వాతంత్ర ఉద్యమనికి తొలి తెలంగాణ ఉద్యమనికి, సహకార సంఘాల ఉద్యమల్లో కీలక పాత్ర పోషించారని ఆయన సేవలకు గుర్తింపు గా భావి తరాలు గుర్తించే లా అయన స్ఫూర్తి కి చిహ్నంగా ఆయనకు భారత రత్న ప్రకటించాలని కేంద్రం రాష్ట్ర ప్రభుత్వలు కృషి చేయాలని అన్నారు ఇట్టి కార్యక్రమం లో ఫోరమ్ ఉపాధ్యక్షులు సజ్జద్ ఖాన్, ప్రధాన కార్యదర్శి అమిదిపురం మహేష్ కుమార్, తేజస యువత అధ్యక్షులు డి పాండు. ఫోరమ్ సహా కార్యదర్శి శ్రీకాంత్, కార్యవర్గ సభ్యులు సాయి వరాల తదితరులు పాల్గొన్నారు.

# కొండా లక్ష్మణ్ బాపూజీ 109 వ జయంతి సందర్బంగా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు



సంగారెడ్డి బ్యూరో,సెప్టెంబర్ 28 ( మెతుకు సీమ న్యూస్) : కొండా లక్ష్మణ్ బాపూజీ 109 వ జయంతి సందర్భంగా సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన బిఆర్ఎస్ శ్రేణులు.కార్యక్రమంలో మాజీ సి డి సి చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి ,పట్టణ అధ్యక్షులు ఆర్ వెంకటేశ్వర్లు, కార్యదర్శి నర్సింలు, కంది మండల పార్టీ అధ్యక్షులు మధుసూదన్ రెడ్డి ,విఠల్, ఎర్రోళ్ళ చిన్న ,శ్రవణ్ రెడ్డి ,తదితరులు పాల్గొన్నారు.

# చాకలి ఐలమ్మ విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ చేసిన రజక సంఘం నాయకులు



గజ్వేల్ నియోజకవర్గ ప్రతినిద్,సెప్టెంబర్ 28 ( మెతుకు సీమ న్యూస్) : మర్కూక్ మండలం చేబర్తి గ్రామంలో రజక సంఘం సభ్యుల ఆధ్వర్యంలో శుక్రవారం రోజున చాకలి ఐలమ్మ విగ్రహ ప్రతిష్ట ఏర్పాటుకు భూమి పూజ నిర్వహించారు.ఈ సందర్భంగా రజక సంఘం కుల పెద్దలు మరియు గ్రామ పెద్దలు మాట్లాడుతూ ఆనాడు బడుగు బలహీన వర్గాల మహిళల్లో ఆత్మస్థర్యాన్నినింపి రజాకార్ల నిరంకుశ పరిపాలన కింద ప్రజల జీవితాలతో విచ్చలవిడిగా చెలగాటం ఆడిన జగిర్దారులు దేశ్ముక్ లు దొరల పట్వారిలా అరాచకానికి గురైన అందరిలో ధైర్యాన్ని నింపి వారిని దేశం నుండి తరిమికొట్టిన ఆమెను ధైర్య సాహసాలను త్యాగాలను తెలంగాణ ప్రజలు మరిచిపోరని అన్నారు. చాకలి ఐలమ్మ తెలంగాణ సమాజానికి ఆదర్శ దాయకమని కొనియాడారు.నేటితరం యువత,మహిళలు ఐలమ్మ స్ఫూర్తితో ముందుకు సాగాలనీ అన్నారు. రజాక సంఘం నాయకులు ముందుకు వచ్చి చేబర్తి గ్రామంలో చాకలి ఐలమ్మ విగ్రహ ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు.ఈ కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ ఎర్రబాగు అశోక్,తాజా మాజీ ఉపసర్పంచ్ గుర్రాల స్వామి,మాజీ రైతు సమన్వయ కమిటీ అధ్యక్షుడు జాలని బాల్ నర్సయ్య,తోట ఆంజనేయులు,రజక సంఘం సభ్యులు,తదితరులు పాల్గొన్నారు.

# కార్మిక చట్టాలను కాలరాస్తున్న మోడీ సర్కార్

## - కలెక్టరేట్ ముట్టడి జయప్రదం చేయండి




కొండాపూర్,సెప్టెంబర్ 28 ( మెతుకు సీమ న్యూస్) : సిఐటియు కొండాపూర్ పారిశ్రామిక క్లస్టర్ పరిధిలో నేడు రేపు సంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు కాంట్రాక్ట్ వర్కర్స్, ఔట్సోర్సింగ్, నాన్ పర్మినెంట్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం తలపెట్టిన కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని క్లస్టర్ వ్యాప్తంగా ఆటో జాత వివిధ పరిశ్రమల వద్ద ప్రచారంనిర్వహించడం జరిగింది, ఈ సందర్భంగా సిఐటియు సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు బీరం మల్లేశం మాట్లాడుతూ కొండాపూర్ క్లస్టర్ పారిశ్రామిక ప్రాంతంలోని కాంట్రాక్ట్ వర్కర్స్, నాన్ పర్మినెంట్ కార్మికులు, ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని అన్నారు, వారికి కనీస వేతనాలు 26 వేలకు పెంచాలని కార్మిక చట్టాలను అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు, ఏండ్ల తరబడి కాంట్రాక్ట్ వర్కర్స్ నాన్ పర్మినెంట్ కార్మికులు పనిచేస్తున్న వారిని పరిశ్రమ యాజమాన్యాలు పర్మినెంట్ చేయడం లేదని మండిపడ్డారు, వారి అందరిని పర్మినెంట్ చేయాలని కోరారు, రాష్ట్రంలోని 73 షెడ్యూల్ ఎంప్లాయిస్మెంట్లో కనీస వేతనాలు సవరించి పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలను పెంచాలని కోరారు, కార్మిక చట్టాలను అమలు చేయకుండా, 12 గంటలను పని అమలు చేస్తూ శ్రమదోపిడి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు, మోడీ సర్కార్ కార్మిక చట్టాలను కాలరాస్తు లేబర్ కోడులను తీసుకువచ్చిందని మండిపడ్డారు, కార్మికులకు నష్టం కలిగించే లేబర్ కోట్లను వెంటనే ఉపసంహరించుకోవాలని అన్నారు, వలస కార్మికులకు 1979 అంతర్రాష్ట్ర వలస కార్మిక చట్టం అమలు చేయాలని వారికి కనీస వసతి సౌకర్యాలు కల్పించాలని అన్నారు, 8 గంటల పని దినం అమలు చేయాలని అదనపు పనికి అదనపు వేతనం చట్ట ప్రకారం డబుల్ ఇవ్వాలని అన్నారు, కార్మికులందరికీ ఈఎస్ఐ, పిఎఫ్, బోనస్, గ్రాట్యుటీ అమలు చేయాలని, అపాయింట్మెంట్ లెటర్స్ గుర్తింపు కార్డులు ప్లే సిప్పులు ఇవ్వాలని అన్నారు, కార్మికుల సమస్యలు పరిష్కారం చేయకుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందని అన్నారు, కార్మికుల పట్ల ఈ రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే కార్మిక చట్టాలను సవరించి వేతనాలను పెంచాలని అన్నారు, ఈ సమస్యల పరిష్కారం కోసం రేపు రాష్ట్రవ్యాప్తంగా కలెక్టర్ కార్యాలయంలో ముందు ఆందోళన కార్యక్రమాలకు సిఐటియు తెలంగాణ రాష్ట్ర కమిటీ పిలుపునివ్వడం జరిగిందని అన్నారు, రేపు సంగారెడ్డి కలెక్టర్ కార్యాలయం ముందు జరిగే ధర్నాకు కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు, అప్పటికి ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కారం చేయకపోతే ఈ నెల 30న లేబర్ కమిషనర్ కార్యాలయం ముందు పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలను నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు కొండాపూర్ క్లస్టర్ కన్వీనర్ బాబురావు, సిఐటియు ఫ్లస్టర్ నాయకులు కొండల్ రెడ్డి, రమేష్, వెంకట్ రెడ్డి, రమేష్, కృష్ణ, మధుకర్, తదితరులు పాల్గొన్నారు.

---

# ఘనంగా కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు



రాయికోడ్,సెప్టెంబర్ 28 ( మెతుకు సీమ న్యూస్) : సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండలంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఓ ఎంఎం షరీఫ్ ఆధ్వర్యంలో క్విట్ ఇండియా, ముల్కీ, తెలంగాణ ఉద్యమాల్లో కీలక పాత్ర పోషించిన స్వాతంత్ర్య సమరయోధుడు, జాతి గర్వించదగ్గ ఉద్యమకారుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి నీ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపరిడెంట్ నర్సింహారెడ్డి,ఏపీవో రమేష్ జూనియర్ అసిస్టెంట్ శ్యామ్ మరియు మండల ఆఫీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

---

# ఘనంగా ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలలు



హత్నూర,సెప్టెంబర్ 28 ( మెతుకు సీమ న్యూస్) : ఘనంగా కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలను సంగారెడ్డి జిల్లా హత్నూర మండల పరిధిలోని దౌల్తాబాద్ గ్రామంలో శుక్రవారం పద్మశాలి సంఘం అధ్యక్షులు,కార్యదర్శులు,కార్యవర్గ సభ్యులు.ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి విడుదలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వాతంత్ర పోరాటం, నిజాం నిరంకుశ వ్యతిరేక ఉద్యమం, ప్రత్యేక తెలంగాణ కోసం మూడు దశల ఉద్యమాల్లో ప్రముఖ పాత్ర పోషించి దేశసేవకు అంకితమైన వ్యక్తి కొండాలక్ష్మణ్ బాపూజీ 109 వ జయంతిని శ్రీ మార్కండేయ పద్మశాలి సంఘం-దౌల్తాబాద్ ఆధ్వర్యంలో కొండాలక్ష్మణ్ బాపూజీ చిత్రానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. దేశ సేవకు అంకితమై, స్వాతంత్రపోరాటం నిజాం నిరంకుశత్వం పాలనలో నిరంతరం పోరాడిన వ్యక్తి అని కొనియాడారు, కొండా లక్ష్మణ్ బాపూజీ జీవితం భావి తరాలకు ఆదర్శనీయమన్నారు,తెలంగాణ సాధనతో పాటు బడుగు బలహీన వర్గాల కోసం ఆయన జీవితాంతం పోరాడారని గుర్తుచేశారు. దేశంలో బాపూజీ అని గౌరవం దక్కిన రెండో వ్యక్తి, మంత్రి పదవిని కూడా తృణప్రాయంగా వదిలి, తెలంగాణ త్యాగశీలుల్లో ప్రథమంగా నిలిచే వ్యక్తి బాపూజీ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం అధ్యక్షులు తుమ్మలపల్లి సత్యనారాయణ ,కార్యదర్శులు, కార్యవర్గసభ్యులు, సభ్యులు పాల్గొన్నారు, సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సదాశివపేట మండలం పెద్దాపూర్ లోని సర్వేనెంబర్ 626,627, 628 లలో శిల్పా వెంచర్ నాల కబ్జా చేసినట్టు గుర్తించిన అధికారులు




సదాశివపేట,సెప్టెంబర్ 28 ( మెతుకు సీమ న్యూస్) : మండల పరిధిలోని పెద్దాపూర్ గ్రామ శివారులోని సర్వే నెంబర్ 626, 627, 628 లలో శిల్పా వెంచర్ యాజమాన్యం నాలా కబ్జా చేసి, 20 మీటర్ల ఉన్న నల్లవాగుని కబ్జా చేసి పది మీటర్లకే పరిమితం చేసిన శిల్పా వెంచర్ యాజమాన్యం. కబ్జాకు గురి అయిన భూమిని గుర్తించేందుకు శుక్రవారం నాడు సర్వే నిర్వహించిన రెవెన్యూ ఇరిగేషన్ అధికారులు. డిజిటల్ సర్వేని పరిశీలించిన సదాశివపేట తహసిల్దార్ సరస్వతి. ఈ సందర్భంగా తాసిల్దార్ సరస్వతి మాట్లాడుతూ సర్వేనెంబర్ 626, 627 ,628 నెంబర్లలో సర్వే చేస్తున్నామని,మొన్న కురిసిన భారీ వర్షాలు వచ్చినప్పుడు నాలాను కుదించడం వల్ల ఓవర్ ఫ్లో వల్ల నేషనల్ హైవేపై వరద నీరు రావడం జరిగింది. దీంతో వెంచర్ యజమానికి నోటీసులు ఇచ్చి సర్వే చేస్తున్నామని, కాల్వ 20 మీటర్లు ఉండాలని, సర్వే చేసి హద్దులు మార్కింగ్ చేస్తున్నామని తెలిపారు. తర్వాత బఫర్ జోన్ లో ఉన్న నిర్మాణాలపై చర్యలు తీసుకుంటామని అన్నారు.

---

# శ్రీ సరస్వతీ శిశు మందిర్ లో ఫైర్ అవర్ నేస్ ప్రోగ్రాం




సదాశివపేట,సెప్టెంబర్ 28 ( మెతుకు సీమ న్యూస్) : సరస్వతి శిశుమందిరంలో జరిగిన కార్యక్రమంలో ఫైర్ స్టేషన్ ఆఫీసర్ యన్ బిక్షపతి ఫైర్ స్టేషన్ గురించి, ఫైర్ విపత్తుల నివారన గురించి, ఫైర్ ఆర్పడానికి ఉపయోగించె పరికరాలను తీసుకొని వచ్చి, అందులోని మేలుకువలను ఆపదనుంచి తప్పించుకొనే విధానాలను ప్రాక్టికల్ గా చూపించారు. అలాగే . నర్సంహారెడ్డి లీడ్ ఫైరమెన్ మూర్గదర్శకం చేస్తూ, భూకంపం, అధిక వర్షాల విపత్తు నీటిలో మునీగిన, రక్షించే విధానం గురించి ప్రాక్టికలగా చూపించి మార్గ దర్శకం చేశారు. అలాగే సి ఎచు నవీన్ గౌడ్ ఫైర్మెన్ మరియు శిశుమందిర్ పూర్వ విద్యార్థి మాట్లాడుతూ గ్యాస్ లకైనపుడు రక్షించుకునే విధానం, రిఫ్రిజిరేటర్ వాడే విధానం, కరెంట్ స్విచ్ ఆఫ్, ఆన్ చీసే విధానంలో, గ్యాస్ కి వీటికి సంబంధాన్ని, ఆపాయం జరిగినపుడు తప్పించుకోనే విధానాన్ని తెలిపారు. విద్యార్థులందరు ఎంతో చక్కగా వీరు తెలియజేసిన వినయాలను విన్నారు. ఈ కార్యక్రమంలో ఫైర్ ఆఫీసర్ యన్. బిక్షపతి, జి నర్సంహారెడ్డి వీరితో పాటు డ్రైవర్ ఫైర్ ఆపరేటర్ సుదర్శన్ మరియు పైర్ ర్మెన్ నరేష్ రెడ్డి, ఫైర్మెన్ మరియు చైతన్య ఫైర్మెన్ సి ఎచు నవినా గౌడ్ తోపాటు ఆచార్యలు, విద్యార్థులు, మతాలు పాల్గోన్నారని ప్రధానాచార్యులు టీ సంగమేశ్వర్ తెలిపారు.

---

# సదాశివపేట బీ ఆర్ ఎస్ పట్టణ యువత అధ్యక్షుడిగా కొత్తకొండ శ్రీకాంత్(డబ్బా నాని) ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసిన ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



సదాశివపేట,సెప్టెంబర్ 28 ( మెతుకు సీమ న్యూస్) : సదాశివపేట బిఆర్ఎస్ పట్టణ యువత నూతన అధ్యక్షుడిగా కొత్తకొండ శ్రీకాంత్ (డబ్బా నాని)ను నియమిస్తూ ఉత్తర్వులను ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ శుక్రవారం అందజేశారు. ఈ సదర్భంగా నూతనంగా నియమితులైన కొత్తకొండ శ్రీకాంత్ (డబ్బా నాని)ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ని కలిసి కృతజ్ఞతలు తెలిపారు.అనంతరం ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి పట్టణ యువత అధ్యక్షుడిగా ఎన్నుకునందుకు ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ కి మరియు పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. రానున్న స్థానిక ఎన్నికల్లో బీ ఆర్ ఎస్ పార్టీ గెలుపునకు తన వంతు ప్రయత్నం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చర్మ చింతా గోపాల్,యాదుల్ కామిల్ కాజా మహేందర్ రెడ్డి ఆవుసలి సంగప్ప జైన్ ప్రదీప్ బీ ఆర్ ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

---

# లంచం తీసుకుంటు ఏసీబీ కి దొరికిన కొండాపూర్ కార్యదర్శి




కొండాపూర్,సెప్టెంబర్ 28 ( మెతుకు సీమ న్యూస్) : సంగారెడ్డి జిల్లా కొండాపూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. ఓనర్ షిప్ సర్టిఫికెట్ కోసం లంచం డిమాండ్ చేసిన పంచాయతి కార్యదర్శి షకీల్ రూ.7000 లంచం తీసుకుంటూ పట్టుబడ్డారు. అధికారులు పంచాయతీ కార్యాలయంలో రికార్డులు తనిఖీ చేపట్టారు. కార్యాలయంలోకి ఎవరు రాకుండా బందోబస్తు ఏర్పాటు చేసి విచారించారు. ఘటనపై మరింత సమాచారం చేపట్టనున్నారు.

# ‘అధ్యయనం-పోరాటం’ ఆయుధంగా

ఐసీయులోకి పోయిన సీతారాం ఏచూరి ఇక రారనీ, అక్కడి నుంచి అంతిమయాత్రకేనని ఎవరూ ఊహించలేదు.ఆయన మరణం పట్ల ఉన్నతస్థాయి స్పందన చూసాం.దేశం సంక్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటున్న సమయంలో కామ్రేడ్ ఏచూరిని కోల్పోయింది.

దేవుడిని,మతాన్ని స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటున్న ప్రస్తుత పరిస్థితుల్లో ఆయన లేని లోటు స్పష్టంగా కనిపిస్తుంది. మత విశ్వాసానికి, మతోన్మాదానికి మధ్య ఉన్న విభజన రేఖను స్పష్టంగా గుర్తిస్తూ ఉన్మాదపు ఎత్తుగడలను సమర్ధవంతంగా తిప్పికొట్టిన నేత.

రాజకీయాల్లో విలువలకు వలువలూడిన కాలం ఇది. ఆ విలువలకే విలువలద్దిన నేత సీతారాం ఏచూరి. పదవికి దూరంగా పది రోజులు కూడా ఉండలేక గోడ దూకే కాలం. అన్ని అవకాశాలుండి కూడా తాను అడుగు పెట్టిన రాజకీయాలనే అంటిపెట్టుకుని అర్థ శతాబ్దం నిలిచిన నేత.తుది శ్వాస వరకు తాను నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడిన నేత. అందుకే ఇది అనేక మంది రాజకీయ నాయకులకు ఆశ్చర్యం కలిగిస్తున్నది.

ఆయన ఒక విజ్ఞాన శిఖరం.బాల్యం నుంచి తుది ఘడియల వరకు ఆ శిఖరం ఎదుగుతూనే వచ్చింది. పదహారేండ్ల వయస్సులోనే అంతర్జాతీయ స్థాయి వ్యాసరచన పోటీలో నెగ్గి అందుకు బహుమతిగా అమెరికా అధ్యక్షునితో వైట్‌హౌస్‌లో అల్పాహారం తీసుకున్నారు.



హయ్యర్ సెకండరీ స్థాయి పరీక్షలలో ఆల్ ఇండియా అగ్రస్థానం సాధించారు.ఆ రోజుల్లోనే పిల్లలకోసం ప్రచురించిన జూనియర్ స్టేట్స్‌మెన్ పత్రిక సీతారాం ఏచూరిని భావిభారత ప్రధానిగా అభివర్ణించిందని ఆయన బాల్య మిత్రుడు సంజయబారు గుర్తుచేసారు.

ప్రతిష్టాత్మక జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ (జెఎన్‌యూ)లో కూడా అత్యుత్తమ అధ్యయనశీలి గానే నిలిచారు. కుటుంబ పెద్దలు ఉన్నతస్థాయికి ఎదిగిన నేపథ్యం కూడా ఉన్నది. వ్యక్తిగత అభివృద్ధికి ఇన్ని అవకాశాలు ఉండి కూడా అన్నీ వదులుకుని మార్క్సిజమే మార్గంగా ఎంచుకున్నారు. భారతదేశంలో నేటి గొప్ప మార్క్సిస్టు మేధావిగా నిలిచారు.

ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమం అత్యంత సంక్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటున్న కాలంలో భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ప్రతినిధిగా అత్యంత సమర్ధవంతంగా జోక్యం చేసుకున్నారు.

విద్యార్థి ఉద్యమానికి దిశానిర్దేశం చేస్తూ కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య రూపొందించిన కీలకమైన నినాదాలను మనసా, వాచా, కర్మణా అక్షరాల అమలు చేసిన నేత సీతారాం ఏచూరి.

ఆయన భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్‌ఎఫ్‌ఐ) అఖిల భారత నాయకులుగా ఉన్న సమయంలోనే ‘అధ్యయనం %-% పోరాటం’ అన్న నినాదం దేశ మంతా మారు మోగింది. ‘చదువుతూ పోరాడు %-% చదువుకై పోరాడు’ అని సాధారణ విద్యార్థులు కూడా అందు కున్న నినాదం ఇది.అంతేకాదు, పాఠ్యపుస్తకాలే కాక,సమాజాన్ని కూడా అధ్యయనం చేయాలన్న సందేశాన్నిచ్చిన నినాదం ఇది.

అనతికాలంలోనే ఇది అన్ని విద్యార్థి సంఘాల నినాదంగా మారింది.మా నినదాన్ని స్వీకరించిన ఇతర సంఘాలు మా విధానాలను కూడా స్వీకరిస్తే మంచిదని సీతారాం చురకలు వేసేవారు. విద్యార్థి ఉద్యమంలో సమ్మె ఒక ముఖ్యమైన ఆయుధంగా చలామణి అవుతున్న కాలమది.

ఉత్పత్తి రంగంలో వర్గ పోరాటానికి,విద్యార్థి రంగంలో పోరాటానికి మధ్య ఉన్న తేడాను చూపిన సుందరయ్య బాటలో నాటి ఎస్‌ఎఫ్‌ఐ నాయకత్వం ముందుకు సాగింది. పరిశ్రమలు, వ్యవసాయ రంగంలో సమ్మెలు ఉత్పత్తిని స్తంభింపజేస్తాయి. పెట్టుబడిదారీ, భూస్వామ్య వర్గాల మీద పోరాటానికి సమ్మె పదునైన ఆయుధం.ప్రత్యేక సందర్భాల్లో తప్ప, విద్యార్థి ఉద్యమంలో అది సాధారణ ఎత్తుగడ కాజాలదని స్పష్టం చేసింది.నాటి విద్యార్థి ఉద్యమంలో ఇది తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఇది కూడా ఏచూరి నాయకత్వంలోనే దేశ వ్యాపితంగా ప్రచారంలోకి వచ్చింది.అతి త్వరలోనే విస్తృత ఆమోదం పొందింది.

విద్యా సంస్థల్లో భౌతికదాడులు సర్వసాధారణంగా మారిన కాలమది.భౌతిక దాడులు కాదనీ, భావసంఘర్షణ కేంద్రాలుగా భాసిల్లాలని నాటి నాయకత్వం నినదించింది. ఈ వైఖరులన్నీ విద్యారంగం లోనూ,విద్యార్థుల తల్లిదండ్రులు, సమాజం లోనూ ఆదరణ పొందాయి.

నిరుద్యోగ సమస్యను పరిష్కరించడంలో విఫలమైన పాలకులు సమస్యను రిజర్వేషన్ల చుట్టూ తిప్పే ప్రయత్నం ఇప్పుడే కాదు,ఆ కాలంలోనే మొదలైంది. సహజం గానే రెండు వాదనలు ముందు కొచ్చాయి. తరతరాలుగా వివక్షకు గురైన తరగతుల నుంచి కొందరు రిజర్వేషన్లే సర్వరోగ నివారిణిగా పైకెత్తేందుకు ప్రయత్నించారు. ఊరట కల్పించే చిన్న అవకాశాన్ని ఉన్నత మైన పరిష్కారంగా చూపించారు.

మరోవైపు కొందరు రిజర్వేషన్ల వల్లనే ప్రతిభావంతులు అవకాశాలు కోల్పోతున్నారనే వాదన చేసారు. ఇలాంటి సమయంలో భారత విద్యార్థి ఫెడరేషన్ ఇచ్చిన నినాదం ‘అందరికీ విద్య-అందరికీ ఉద్యోగం’ విద్యార్థి లోకాన్ని ఆకర్షించింది. ఐక్యంగా నిలిపే నినాదంగా ముందు కొచ్చింది. ఐక్య పోరాటాలకు బాటలు వేసింది.

సమాజంలో అందరికీ చదువుకునే అవకాశం కల్పించి, అందరికీ ఉపాధి అవకాశాలు అందుబాటు లోకి తెస్తే రిజర్వేషన్ల ప్రశ్నే ఉదయించదు కదా! అందుకే ఈ నినాదం దేశమంతా మారుమోగింది.

అనేక ప్రాంతాల్లో విచ్ఛిన్నకర ఉద్యమాలతో విద్యార్థిలోకం ప్రభావితం అవుతున్న కాలంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకత్వం ‘మా దేహం ముక్కలైనా %-% దేశాన్ని ముక్కలు కానివ్వం’ అని గర్జించింది.ఈ నినాదం విద్యార్థి లోకాన్ని పెద్ద ఎత్తున ప్రభావితం చేసింది. ఇలాంటి నినాదాలు విద్యార్థుల హృదయాలను కదలించే విధంగా ముందుకు తీసుకెళ్ళడంలో సీతారాం అగ్రగణ్యుడు.

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) అగ్రనేతగా సీతారాం ఏచూరి భౌతిక కాయానికి జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ ప్రాంగణంలో అధికారుల నుంచి విద్యార్థుల వరకు అందరూ నివాళులు అర్పించిన తీరు ప్రత్యేకతను సంతరించుకున్నది.

జెఎన్‌యూ స్టూడెంట్స్ యూనియన్ అధ్యక్షులుగా వరుసగా మూడుసార్లు ఎన్నికైన ఏకైక నాయకుడు ఏచూరి. ఆరోగ్యకర మైన విద్యార్థి ఉద్యమ సంప్రదాయాలు నెలకొల్పి ఎస్‌ఎఫ్‌ఐ బలమైన కేంద్రంగా జెఎన్‌యూను రూపు దిద్దిన ఇద్దరు నాయకుల్లో ఏచూరి ఒకరు. జెఎన్‌యూలో ప్రకాష్‌కారత్,సీతారాం ఏచూరిల నాయకత్వంలో నిర్మించిన విద్యార్థి ఉద్యమమే నాటికీ, నేటికీ ఒక నమూనా అంటే అతిశయోక్తి కాదు.జెఎన్‌యూలో ఏచూరికి అందిన అసాధారణ నివాళిని ఈ నేపథ్యంలోనే అర్థం చేసుకోవచ్చు.

అర్థశాస్త్రం,తత్వశాస్త్రం,చరిత్ర,రాజ్యాంగం, ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమం వంటి అనేక అంశాలను లోతుగా అధ్యయనం చేసారు. భారతీయ తాత్విక చింతన మూలాల ఆధారంగానే మతోన్మాదుల వాదనలను తిప్పికొట్టిన మేధావి.ఇది సహించలేకనే ”హైందవ శక్తి” అనే పేరుతో కొందరు ఉన్మాదులు చనిపోయిన ఏచూరి మీద నీచమైన నిందాపూరిత ప్రచారం ప్రారంభించారు. అది ఎలాంటి సంస్కారమో, ఎట్లాంటి సంస్కృతో వారే సమాధానం చెప్పాలి.

పార్లమెంట్‌లో సీతారాం ఏచూరి ప్రసంగాలు అన్ని పక్షాలకు చెందిన సభ్యులు శ్రద్ధగా వినే వారంటేనే ఆయన లోతైన అధ్యయనం, హేతుబద్ధమైన వాదనాపటిమ గురించి అర్థం చేసుకోవచ్చు.

ఏచూరి తండ్రి కోరిక మేరకు ఆయన మేనమామ మోహన్‌కందా (ఉమ్మడి రాష్ట్రప్రభుత్వ మాజీ చీఫ్ సెక్రటరీ) గారు సీతారాం ఏచూరిని రాజకీయ కార్యకలాపాల నుంచి తప్పుకోవాలని నచ్చ జెప్పేందుకు ప్రయత్నించారట.ఈ ప్రయత్నంలో సీతారాం మారకపోగా,తానే మార్క్సిస్టుగా మారిపోతానేమోనన్న పరిస్థితి ఏర్పడిందని మోహన్‌కందా గుర్తు చేసుకున్నారు. మార్క్సిజం- లెనినిజం పట్ల సీతారాం ఏచూరి ప్రదర్శించిన అచంచల విశ్వాసం ఫలితమిది.

నేటి పరిస్థితుల్లో కమ్యూనిస్టు విలువలు, క్రమశిక్షణా పాటించవలసి వచ్చినప్పుడు తల్లిదండ్రులు లేదా కుటుంబ సభ్యుల ఒత్తిడి పేరుతో కొంతమంది మినహాయింపులు కోరడం చూస్తున్నాం. అధ్యయన శీలిగా, ప్రజా ప్రయోజనాల కోసం జీవితాంతం నిబద్ధతతో కృషి చేసిన నేతగా ఆయన భవిష్యత్ తరాలకు ఆదర్శం.

ప్రపంచీకరణ ప్రభావంతో సమిష్టి ప్రయోజనం స్థానంలో వ్యక్తిగత ప్రయోజనానికి పెద్దపీట వేస్తున్న నేడు యువతలో కెరియరిజం ఒక దశలో పరాకాష్టకు చేరింది.ఇప్పుడిప్పుడే పరిస్థితుల్లో మళ్ళీ మార్పులొస్తున్నాయి. ప్రపంచీకరణ భ్రమలు మంచుతెరల్లా కరగడం మొదలైంది.అభివృద్ధి చెందిన అమెరికా వంటి దేశాల్లో కూడా యువత జీవితంలో అస్థిరత పెరుగుతున్నది. భవిష్యత్తు ప్రశ్నార్థకమవు తున్నది.

మరోవైపు కృత్రిమ మేథ (ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్) పేరుతో శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానం వేగంగా దూసుకు పోతున్నది. శ్రమ దోపిడీకి దీనిని సాధనంగా వాడుకుని లాభాలు దండుకునేందుకు పెట్టుబడి దారీ వర్గం సర్వశక్తులు ఒడ్డి ప్రయత్నిస్తున్నది.

సీతారాం అమలు చేసిన చూపిన ‘అధ్యయనం- పోరాటం’ ప్రాధాన్యత మరొకసారి ముందుకొచ్చింది.ప్రజల్లో పెరుగుతున్న అసంతృప్తిని రాముని పేరుతో, మతం పేరుతో పక్కదారులు పట్టించే ప్రయత్నాలు జరుగుతున్న స్థితిలో ఉన్నాం.

మనిషి ప్రశ్నించేతత్వాన్ని,తెలుసు కోవాలన్న జిజ్ఞాసను నీరుగార్చేందుకు పాలక వర్గాలు మతం పేరుతో తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నాయి. అందులో భాగంగానే మనిషి జీవితం నిరర్థకం అనీ,చేయ గలిగిందేమీలేదని శ్రామికులను నిరుత్సాహ పరచడానికి పూనుకుంటున్నాయి.ఈ సందర్భంగా ”జీవితం నిరర్థకం కాదు%‘% చనిపోయేంత వరకు జీవితపు ఉపయోగితను సాధ్యమైనంత ఎక్కువగా పెంచుకోవాలి” అన్నారు సీతారాం ఏచూరి. అదే ఆయన ఆచరించి చూపారు.

అంతేకాదు, చనిపోయిన తర్వాత కూడా ఆయన శరీరపు ఉపయోగితను మరింత పెంచి చూపించారు. తన దేహాన్ని వైద్య పరిశోధనల కోసం ఎయిమ్స్‌కు అప్పగించారు. అందుకే నేటి యువతకు ఆయనొక ఐకాన్. ఆయన నమ్మిన మార్క్సిజమే మార్గదర్శకం.





Printed,Published and owned by baindla Srinivas,Madava nagar,Sangareddy-502001,Telangana State,
Phone No. 9032793822 Mail id:methukuseemanews@gmail.com